
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 23.2
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
మంగళవారం 26 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.30 (298.3005)	1,90,042	1,90,042 (18గేట్ల ఎత్తివేత)
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.65 (4.11)	1,260	1,859
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814 (38.0890)	2,27,382	1,14,494

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

ఆదిలోనే నిరసన



కలెక్టరేట్ వద్ద మహిళా రైతుల నిరసన

- వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న రైతులు
- మొన్న ఆర్డీవో కార్యాలయం వద్ద తాజాగా కలెక్టరేట్ వద్ద నిరసన

హుజూర్‌నగర్ పరిధిలో వ్యవసాయ యూనివర్సిటీ కోసం చేపట్టిన భూసేకరణ సర్వేకు ఆదిలోనే నిరసనలు ఎదురవుతున్నాయి. మగ్దుమ్‌నగర్‌లో యూనివర్సిటీ ఏర్పాటు కోసం 10 రోజులుగా భూసేకరణకు అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే మొదటి సమావేశానికి హాజరైన రైతులు యూనివర్సిటీని ఆహ్వానించారు. ఆ తర్వాత కొందరు ఈ నెల 23న ఆర్డీవో కార్యాలయం ఎదుట, సోమవారం కలెక్టరేట్ ఎదుట యూనివర్సిటీకి భూములు ఇచ్చేది లేదంటూ నిరసన తెలిపారు. దీంతో యూనివర్సిటీ ఏర్పాటు అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

హుజూర్‌నగర్ పట్టణం మగ్దుమ్‌నగర్‌లోని 1,041 సర్వే నెంబరులో ప్రభుత్వ భూమి 273 ఎకరాలు ఉంది. ఇందులో సుమారు 250 మంది 50 ఏళ్లగా మూడు తరాలకు చెందిన రైతులు భూములు సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిని వ్యవసాయ యూనివర్సిటీకి అనువైనదిగా అధికారులు భావించారు. ఈ క్రమంలో 10 రోజుల కిందట ఇక్కడి రైతులతో పట్టణంలోని టౌన్‌హాల్‌లో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఇందుకు సుమారు 50 మంది రైతులు హాజరయ్యారు. భూసేకరణ అధికారిగా ఉన్న ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డిలు ప్రభుత్వ భూమికి సంబంధించి విధి విధానాలను రైతులకు వివరించారు. ఈ సమావేశానికి హాజరైన రైతులంతా భూసేకరణకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆ తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ వీసీ, శాస్త్రవేత్తలు, కలెక్టర్‌తో వారంరోజుల క్రితం రెండు పర్యాయాలు పరిశీలించారు. అప్పుడు కూడా రైతులు భూసేకరణపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. 10రోజుల నుంచి సర్వేయర్లకు రైతులు వచ్చి వివరాలు అందజేశారు. అయితే సమావేశానికి రాని రైతుల్లో కొంతమంది ఈ నెల 23న ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట పురుగుమందుల డబ్బాలు పట్టుకుని నిరసన తెలిపారు. తమ భూములు తీసుకోవద్దని, అవసరమైతే చనిపోతామని హెచ్చరించారు.



నిర్ణయం కాకముందే...

మగ్దుమ్‌నగర్ ప్రాంతంలో వ్యవసాయ యూనివర్సిటీ నిర్మించాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నా అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా మగ్దుమ్‌నగర్‌తో పాటు పాలకవీడు మండలంలోని రాఘవపురంలో కూడా భూపరిశీలన చేశారు. వాస్తవంగా మగ్దుమ్‌నగర్‌లోని ప్రభుత్వ భూమి 1,041 సర్వే నెంబర్‌లో 270 ఎకరాలు ఉండగా దానిలో 40 ఎకరాల్లో మగ్దుమ్‌నగర్ గ్రామం ఉంది. మిగిలిన 230ఎకరాల భూమిలో యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ భూమి హుజూర్‌నగర్ పరిధిలో ఉండడం, తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడం, భూమి కూడా వ్యవసాయ క్షేత్రానికి అనుకూలంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

అందుబాటులో ఉండాలని...

వ్యవసాయ యూనివర్సిటీకి పెద్దసంఖ్యలో శాస్త్రవేత్తలు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రొఫెసర్లు (మిగతా 8వ పేజీలో)

అర్జీలను వారంలోగా పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి అర్జీలను వారంలోగా పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. కొన్నిశాఖల్లో ఎక్కువ రోజుల నుంచి అర్జీలు పరిష్కారం కాకుండా ఉంటే అటువంటి శాఖల అధికారులు వారంగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. భూములకు సంబంధించిన 38 అర్జీలు, ఎంపీడీవోకి 11, ఇతర అధికారులకు 47 అర్జీలు మొత్తం 96 వచ్చాయన్నారు. వీటిని సంబంధిత శాఖలకు పంపిస్తామని, జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం పర్యావరణ రహిత గణేష్ చవితి కోసం ప్రత్యేకంగా రూపొందించిన మట్టి వినాయకుల ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ రాంబాబు, డీఆర్‌డీవో పీడీ వీవీ అప్పారావు, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, డీఏవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. నీరు, పారిశుధ్య జిల్లా కమిటీల సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్, తాగునీరు, పారిశుధ్యం, హెల్త్, మూత్రశాలల శానిటేషన్, మిషన్‌భగీరథ ట్యాప్ కనెక్షన్ ప్రణాళిక తయారు చేయడం వంటి వాటిపై అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని కమిటీలకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో వీవీ అప్పారావు, డీఎఫ్‌వో సతీష్, డీఈవో అశోక్, డీపీవో యాదగిరి, దయానంద రాణి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు భవిష్యత్‌లో ఉన్నతస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో చదివిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతస్థానంలో ఉంటారని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని చివ్వెంల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాలకు కోహన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.12లక్షల 276 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రెసిడెన్షియల్ పాఠశాలలో చదివి విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చురుకుగా, బాధ్యతగా ఉంటారన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలకు గత ఏడాది చిన్నచిన్న మరమ్మతులు చేశామని, ప్రస్తుతం మరుగుదొడ్లు, పైపులైన్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.16 కోట్లు మంజూరు చేసిందన్నారు. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్రైడ్ ఇండియా ఫౌండర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌సీవో విద్యారాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్‌గుప్తా, నాయకులు డాక్టర్ రామూర్తియాదవ్, షఫిఉల్లా, వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, ఎడ్ల గంగాభవానీవీరమల్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాన్ని సందర్శించిన జడ్జి మారుతీప్రసాద్

మేళ్లచెర్వు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయాన్ని హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ కుటుంబ సమేతంగా సందర్శించారు. అనంతరం స్వామి వారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శంభిరెడ్డి, చైర్మన్ శంభిరెడ్డి, దేవరశెట్టి ఫణికుమార్, ఆలయ అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పవిత్ర



పెన్‌పహాడ్ : ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు మారం పవిత్ర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. సాంకేతికతను ఉపయోగించి పాఠాలు బోధిస్తూ విద్యార్థులకు జీవశాస్త్రంపై ఆసక్తి పెంచుతున్నారు. ఆటలతో నేర్చుకోవడం కోసం 40కార్డుబోర్డు గేమ్స్‌ను సొంతంగా రూపొందించారు. ఈ నేపథ్యంలో ఆమెకు అవార్డు దక్కింది.

ఇక వ్యవసాయశాఖ పల్లెబాట



- నేటి నుంచి పంటల నమోదు ప్రక్రియ
- మూడు జిల్లాల్లో నవంబరు 1లోగా సర్వే పూర్తికి ఏర్పాట్లు
- ఈసారి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీల్లో రైతుల, పంటల వివరాల ప్రదర్శన
- కచ్చితమైన సమాచార సేకరణకు అధికారుల నిర్ణయం
- ప్రతి రైతు సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం

రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పంటల నమోదు ప్రక్రియకు నిర్ణయించింది. ఈ నెల 26 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, నవంబరు 1వ తేదీ నాటికి పూర్తిచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పంటల నమోదు ప్రక్రియలో భాగంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

వ్యవసాయశాఖ ప్రత్యేక రూపొందించిన డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో ప్రతీ రైతు వివరాలు, పంటల సాగు, పట్టాదారు పాస్‌పుస్తకం నెంబర్, సర్వే నెంబర్లు, సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలను నమోదుచేస్తారు. ఈ డిజిటల్ క్రాప్ సర్వేలో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కచ్చితమైన వివరాలను నమోదుచేస్తారు. అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. ఈ సర్వేలో వ్యవసాయశాఖ రూపొందించిన ఏఈవో యాప్‌తో పాటు డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను ఉపయోగించనున్నారు. ప్రతీ క్లస్టర్‌లో, ప్రతీ రైతును యూనిట్‌గా తీసుకొని వారి వివరాలను అధికారులు నమోదుచేస్తారు. అదేవిధంగా సాగు చేసిన పంటల ఫొటోలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పంటల వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయడం ద్వారా కచ్చితత్వం పెరుగుతుందని వ్యవసాయశాఖ అభిప్రాయపడుతోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెల వరకు మొత్తం మూడు నెలలకుపైగా వ్యవసాయ అధికారులు పల్లెబాట పట్టనున్నారు. మూడు జిల్లాలో సాగు విస్తీర్ణంపై సర్వే చేయనున్న అధికారులు సాగుభూమి ఎంత? ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నారు? అని పరిశీలించి వీటిని నమోదుచేస్తారు.

ఉమ్మడి జిల్లాలో 4లక్షలకు పైగా సర్వేనెంబర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 73 మండలాల్లో ఆయా క్లస్టర్ల వారీగా 4,10,729 సర్వే నెంబర్లలో వ్యవసాయ భూములు విస్తరించి ఉన్నాయి. ఈ భూముల్లో ఏ పంటలు సాగుచేశారో అధికారులు యాప్‌లో నమోదు చేస్తారు. నల్లగొండ జిల్లాలో 132 క్లస్టర్లలోని 1,95,957 సర్వే నెంబర్లలో 12,47,562ఎకరాల పంట విస్తీర్ణం ఉంది. సూర్యాపేట జిల్లాలో 1,06,012 సర్వే నెంబర్లలో 6,32,506 ఎకరాల్లో పంటలు విస్తరించి ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 1,08,760 సర్వే నెంబర్లలో 6,07,285 ఎకరాల్లో పంటల విస్తీర్ణం ఉంది. ఈ సర్వే నెంబర్ల ఆధారంగా పంటల విస్తీర్ణాన్ని, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గతంలో సమయం సరిపోక పోవడంతో పంటల నమోదుకు అదనపు గడువును ప్రభుత్వం ఇచ్చింది. ఈ మారు ఏకంగా మూడు నెలలకు పైగా ప్రభుత్వం గడువును కేటాయించింది. ఈ గడువులోగా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంటల నమోదును పూర్తిచేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖ మిగతా 6వ పేజీలో...

పకడ్బందీగా పంటల నమోదు



ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల నమోదు ప్రక్రియను ఈనెల 26 నుంచి నవంబరు 1వ తేదీ వరకు నిర్వహిస్తాం. ఏఈవోలు ప్రతీ గ్రామానికి వెళ్లి, ప్రతీ సర్వేనెంబర్‌లో పంటల, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వ్యవసాయ అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు వారికి సహకరించి పంటల, ఇతర వివరాలను అందజేయాలి. ఈ నివేదికను పూర్తిస్థాయిలో నవంబరు మొదటి వారంలో ప్రభుత్వానికి అందజేస్తాం. ప్రతి వ్యవసాయ అధికారి గ్రామాలను సందర్శిస్తారు.

పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

ఉపాధి అక్రమాలకు ఈకేవైసీతో చెక్

ఉపాధిహామీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలకు ప్రభుత్వం చెక్‌పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. కూలీలు రాకున్నా వచ్చినట్లు, పనులు చేయకున్నా చేసినట్లు ఎక్కువగా నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో వీట న్నింటినీ అడ్డుకునేందుకు ప్రత్యేకంగా ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో ఈకేవైసీని ప్రవేశ పెట్టింది. దీంతో ఉదయం కూలీ ప్రదేశంలో కూలీల ఫొటోలు, సాయంత్రం పనులు ముగిసే వారితో సరిపోలితేనే డబ్బులు వారి ఖాతాలో జమవుతాయి. 6



- ఎన్‌ఎంఎంఎస్ యాప్‌తో ఉదయం, సాయంత్రం కూలీల నమోదు
- క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలకు అడ్డుకట్ట

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

బీపీ మండల్ ఆశయాలు సాధించాలి



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఓబీసీ రిజర్వేషన్లకు ఆద్యుడు బిందేశ్వరీ ప్రసాద్ మండల్ ఆశయాలను సాధించాలని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు భద్రబోయిన సైదులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు జరుగుతున్నాయంటే అది బీపీ మండల్ కృషి అని తెలిపారు. మాజీ ప్రధాని మురార్జీదేశాయ్ బీసీల స్థితిగతులతో ఐదుగురు సభ్యులతో పౌరహక్కుల కమిషన్ వేయగా దానికి చైర్మన్‌గా బీపీ మండల్‌ను వ్యవహరించారన్నారు. బీసీలకు అన్నిరంగాల్లో రిజర్వేషన్లు కల్పించినప్పుడే వారికి సరైన న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బడుగుల నాగార్జునయాదవ్, రాగం రాజశేఖర్‌యాదవ్, మదనాచారి, నాగేంద్రబాబు, శ్యాం, కిరణ్, నాగయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహాల తరలింపులో
జాగ్రత్తలు పాటించాలి: ఎస్పీ



సూర్యాపేటక్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎత్తయిన విగ్రహాలను మండపాలకు తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎత్తయిన విగ్రహాలు ఏర్పాటుచేసే సమయంలో అశ్రద్ధగా ఉండవద్దన్నారు. విద్యుత్ వైర్లను గమనిస్తూ విగ్రహాలను తీసుకెళ్లాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు, విషాదాలు లేకుండా ఉత్సాహంగా నవరాత్రోత్సవాలను జరుపుకోవాలన్నారు. గణేష్ వేడుకల సందర్భంగా యువత ఘర్షణలు పడవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నేరేడుచర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ టేకెన్ ఓవర్ కళాశాలల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంకెన కరుణాకర్‌రెడ్డి సోమవారం డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. పెన్షన్ ప్రతీ ఉద్యోగి హక్కు అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ ద్వారా ఉద్యోగులకు సామాజిక భద్రత లోపిస్తుందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 28ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న దేశ వ్యాప్తంగా నిర్వహించే పెన్షన్ విద్రోహ దినంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలి



ఇటలీ ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న పాఠశాల విద్యార్థులు

నాగార్జునసాగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఇటలీకి చెందిన జేఎంజే సొసైటీ సభ్యులు తెలిపారు. సోమవారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో జేఎంజే సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలను ఇటలీ నుంచి వచ్చిన సభ్యులు సిస్టర్ మేరీ, సిస్టర్ ట్రీజ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో పలు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో అమలుచేస్తున్న విద్యా ప్రణాళికలను, క్రమశిక్షణను కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ లలిత, సిస్టర్ మతీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హన్యానాయక్‌కు గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు



మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సోషల్ వర్కర్, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. యూఏఈకి చెందిన జెడ్ స్క్వేర్ యూనివర్సల్ డ్రీమ్ మేకర్స్ సంస్థ అందించే గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డులలో భాగంగా సోషల్ వర్క్, ఎడ్యుకేషన్ విభాగానికి హన్యానాయక్‌ను ఎంపిక చేసింది. ఢిల్లీలో జరిగిన 5వ బిజినెస్ సమ్మిట్‌లో సంస్థ ప్రతినిధులు హన్యానాయక్‌ను అవార్డు, సర్టిఫికేట్ అందజేశారు. ఈ సందర్భంగా హన్యానాయక్ విలేకరులతో మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను పెంచిందన్నారు. కాగా అవార్డు అందుకున్న హన్యానాయక్‌కు స్వచ్ఛంద సంస్థల సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి అక్రమాలకు ఈకేవైసీతో చెక్

- ఉదయం, సాయంత్ర కూలీల ఫొటోలు ఆన్‌లైన్‌లో..
- సరిపోలితేనే కూలి డబ్బులు

ఉపాధిహామీలో క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతి, అక్రమాలకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్‌ఎంఎంఎస్) యాప్‌ను తీసుకువచ్చింది. వలసలు నివారించేందుకు తీసుకువచ్చిన ఉపాధిహామీ పథకం అక్రమాలకు కేంద్రంగా మారడం, సోషల్ ఆడిట్‌లో రూ.కోట్లలో అక్రమాలు బహిర్గతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో కేవైసీ విధానం అక్రమాలకు చెక్‌పెడుతుందని భావిస్తున్నారు. పనికి హాజరైన కూలీల ఉదయం, సాయంత్రం ఫొటోలు సమానంగా ఉంటేనే వేతనాలు అందనున్నాయి. దీంతో అక్రమాలు నిలిచిపోనున్నాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు 100 రోజులు పనికల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో కూలీలకు పని కల్పించేందుకు ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో అనేక రకాల పనులు చేపడుతున్నారు. ఈ పనులకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. అయితే క్షేత్రస్థాయి సిబ్బంది వారికి ఉన్న అవకాశాలను అక్రమార్జనకు ఉపయోగించుకుంటున్నారు. వారి చేతివాటం ప్రతీ సోషల్‌ఆడిట్‌లో బహిర్గతమవుతోంది. నిధుల నుంచి రూ.లక్షల్లో కాజేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ యాప్‌తో చెక్

సూర్యాపేట జిల్లాలో 2.63 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో నమోదైన కూలీలు మొత్తం 5.7లక్షలు కాగా పనులకు వెళ్తున్న కూలీలు 2.15లక్షల మంది ఉన్నారు. అయితే ఉపాధి పనులకు వస్తున్న కూలీలు హాజరులో అవినీతి జరిగినట్లు అదికారులు గుర్తిస్తున్నారు. ముఖ్యంగా జాబ్‌కార్డులో ఒకరు కూలీకి వచ్చే వారు ఒకరు ఉన్నట్లు గుర్తించారు. దీంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్(ఎన్‌ఎంఎంఎస్) తీసుకువచ్చారు. ఈయాప్ ద్వారా ఈ కేవైసీ చేస్తున్నారు. ముఖ్యంగా కూలికి వచ్చిన వ్యక్తి ఉదయం ఫొటో తీసుకోవడంతో పాటు సాయంత్రం తిరిగి అదే కూలీ ఫొటో మరోసారి నమోదు చేయాలి. ఉదయం, సాయంత్రానికి సంబంధించిన కూలీ ఫొటో సమానంగా ఉంటేనే ఉపాధి వేతనాలు అందుతాయి.

సోషల్ ఆడిట్‌లో అక్రమాలు వెలుగులోకి..

ఉపాధిహామీ పథకానికి సంబంధించిన వాస్తవాలు సోషల్‌ఆడిట్‌లో వెలుగు చూస్తున్నాయి. ఈ పథకంలో ఎక్కువగా ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతున్నారు. గ్రామాల్లో పనులు చేయకుండా, కూలీలు పనికి రాకున్నా అక్కడ పనులు జరిగినట్లు కూలీలకు కూలీ చెల్లించినట్లు తప్పుడు రికార్డులు నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా చేసిన పనుల్లో కూడా రికార్డులో నమోదు చేసే సమయంలో కొలతలను కూలీల సంఖ్యను తప్పుగా నమోదు చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలు గ్రామాల్లో నిర్వహించే సోషల్ ఆడిట్లలో వెలుగుచూస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని గ్రామపంచాయతీల్లో సోషల్ ఆడిట్ పూర్తిచేశారు. కానీ వారి నుంచి అవినీతి సొమ్మును రికవరీ చేయలేకపోయారు. గతంలో జరిగిన అవినీతి విషయంలో బాధ్యుల నుంచి కొంత మొత్తంలో అధికారులు సొమ్ము రికవరీ చేయగలిగారు.

అవినీతికి పాల్పడినా తిరిగి ఉద్యోగంలోకి

ఉపాధిహామీ పథకంలో అవినీతికి పాల్పడి విధుల నుంచి తొలగించబడిన సిబ్బంది తిరిగి కొన్నాళ్లకు ఉద్యోగంలో చేరుతున్నారు. స్థానిక నాయకులు, అధికారులకు అవినీతికి పాల్పడిన వారిపై ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా వారిని తొలగించడడం లేదు. అవినీతికి పాల్పడిన సిబ్బంది ఆ సొమ్మును తిరిగి చెల్లించి విధులకు హాజరవుతున్నారు.

అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు

ఎన్‌ఎంఎంఎస్ యాప్‌తో పాటు ఈకేవైసీ విధానంలో కూలీల ఫొటోలు ఖచ్చితంగా నమోదుచేస్తాం. దీంతో అవినీతికి ఆస్కారం ఉండదు. ఉపాధిహామీ పేరుతో ప్రతి కూలీకి పనులు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ, సూర్యాపేట జిల్లా

వ్యాన్ డ్రైవర్ ఆత్మహత్యా యత్నం

మోత్కూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణానికి చెందిన ఎడ్ల గణేష్ సోమవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. భారత్ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేసే కాంట్రాక్టర్ వద్ద వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గణేష్ ఈ నెల 1 నుంచి కాంట్రాక్టర్ మారిపోవడంతో పనికి వెళ్లడం లేదని తెలిసింది. సోమవారం మోత్కూరు పట్టణ శివారులో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో వెళ్లగా స్థానికులు గమనించారు. అతడిని 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు పైలెట్ సోమేష్, ఈఎంటీ మహేష్ తెలిపారు. గణేష్ ఆత్మహత్య యత్నానికి కారణాలు తెలియ్సా ఉంది.

సకల వర్ణం ఆకాశం...



నల్లగొండ సమీపం దండెంపల్లిలో సోమవారం సాయంత్రం ఆకాశం వివిధ వర్ణాలతో కనిపించింది. నెలవంకతో కూడిన ఆకాశాన్ని ఆసక్తిగా తిలకించారు.

బలవంతపు చందాలు నేరం

గణేష్ ఉత్సవాల సందర్భంగా బలవంతపు చందాలు వసూళ్లు చేయడం చట్టపరంగా నేరం. స్వచ్ఛంద విరాళాలపై ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. విగ్రహ మండపాల ఏర్పాటు వివరాలను పోలీస్‌స్టేషన్లలో తెలియపర్చాలి. మండపాల రక్షణ కోసం పోలీస్ నిఘా ఉంటుంది. నిమజ్జనానికి చిన్నపిల్లలను అనుమతించొద్దు. పోలీస్ శాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. ప్రశాంతంగా నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

ఆంధ్రజ్యోతి: గణేష్ చందాల వసూళ్ల నియంత్రణ ఉంటుందా?

ఏసీపీ : వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వ్యాపారులు, ఇతర వర్గాల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం చట్టపరంగా నేరంగా పరిగణిస్తాం. అదేక్రమంలో స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడం దాతృత్వం కిందకు వస్తుంది. గణేష్ మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా ఏర్పాటుచేసుకోవాలి. ప్రశాంతంగా వేడుకలు జరిగేందుకు పోలీస్ శాఖకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: మండపాల వద్ద మైక్ సెట్లు ఎలాంటివి ఉపయోగించాలి ?

ఏసీపీ: సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి లౌడ్ స్పీకర్లు రాత్రి 10 గంటలకు నిలిపివేయాలి. అవి కూడా సాధారణ మైక్‌సెట్‌లను మాత్రమే వినియోగించాలి. వాటి శబ్దాలతో ప్రజలకు అసౌకర్యం కలగకూడదు. మైక్‌ల ఏర్పాటుకు పోలీస్ అనుమతి పొందాలి. డీజే సౌండ్ సిస్టమ్ పూర్తిగా నిషేధం. డీజేలను వాడితే కేసులు నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: విద్యుత్ సరఫరాకు అనుమతి తీసుకోవాలా?

ఏసీపీ: మండపాల వద్ద లైటింగ్ కోసం టీఎస్ ట్రాన్స్‌కో నుంచి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. షార్ట్‌సర్క్యూట్ జరుగకుండా నాణ్యత కలిగిన వైరింగ్‌ను వినియోగించాలి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపం వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలి. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చూసుకోవాలి. అపరిచిత వ్యక్తుల కదలికలతో పాటు ప్రజలకు అసౌకర్యం కలిగించే విషయాలపై పోలీస్‌లకు లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: మండపాల నిర్మాణాలపై సూచనలు ఏమిటీ?

ఏసీపీ: గణేష్ ప్రతిమలను ప్రతిష్ఠించే వేదికలను పటిష్ఠంగా నిర్మించాలి. దానిపై నాణ్యత గల షెడ్‌లను ఏర్పాటుచేయాలి. లోపలికి వర్షపు నీరు రాకుండా పకడ్బందీగా చేపట్టాలి. మండపంలోనికి మూగజీవాలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నూనె దీపాలతో అగ్ని ప్రమాదాలు జరగకుండ చూడాలి. ఒక వేళ అగ్ని ప్రమాదాలు జరిగితే నివారించేందుకు రెండు బకెట్ల నీళ్లు, రెండు బకెట్ల ఇసుకను అందుబాటులో ఉంచాలి. పర్యావరణాన్ని కాపాడేలా మట్టి గణపతి విగ్రహాలను వాడితే మంచిది. పూజలకు వచ్చే మహిళలు, యువతులపై ఈవ్ టీజింగ్ జరుగకుండా చూడాలి. ఉత్సవాలలో టపాస్‌ల వినియోగం నిషేధం.

బంగారునాణేల కథలల్లి, డబ్బులు కాజేసి..

చివ్వెంల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పురాతన బంగారు నాణేలు ఇస్తామని నమ్మించి రూ.20 లక్షలు మోసపూరితంగా తీసుకున్న నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దురాజ్‌పల్లికి చెందిన వ్యాపారస్తుడు నిమ్మనగోటి వెంకటేశ్వర్లును పురాతన బంగారు నాణేలు ఉన్నాయంటూ పలువురు సంప్రదించారు. పురాతన కుండలో బంగారునాణేలు లభించాయని వీడియో చూపించి రూ.20 లక్షలు ఇస్తే ఇస్తామని నమ్మబలికారు. ఈ క్రమంలో అతడి నుంచి ఈ నెల 10వ తేదీన రెండు కోళ్లను కోసి వాటి రక్తంతో గాయాలున్న వీడియో తీసి బాధితుడికి పంపి రూ.20 లక్షలు వసూలు చేశారని డీఎస్పీ చెప్పారు. ఆ సమయంలో రెండు నకిలీ బంగారు నాణేలు ఇచ్చి నమ్మించారన్నారు. అనంతరం మరోసారి ఆయన్ను భయపెడుతూ రూ.10 వేలు తీసుకున్నారన్నారు. వెంకటేశ్వర్లు తాను తీసుకున్న నాణేలను తెలిసిన వారిచోట పరీక్షించగా నకిలీవని తేలింది. దీంతో ఆయన పోలీసులను సంప్రదించారని డీఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన పసుపుల గణేష్, ఓర్సు చంటి, ముద్దంగుల వెంకన్న, పసుపుల సత్యంతో పాటు పసుపుల నవీన్, ఓర్సు శ్రీను, ఓర్సు గోపమ్మ, పసుపుల లక్ష్మి, ముద్దంగుల అంజలి ఈ ఉదంతంలో ఉన్నారని గుర్తించామన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పసుపుల గణేష్, ఓర్సు చంటి, ముద్దంగుల వెంకన్న, పసుపుల సత్యంలను సూర్యాపేట ఉండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అదేవిధంగా వారి నుంచి రూ.13.25 లక్షలు రికవరీ చేశామన్నారు. మిగతా ఐదుగురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా పురాతన నాణేలు ఉన్నాయని సంప్రదిస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

మేకల దొంగల ముఠా అరెస్ట్

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల దొంగతనాలు

కట్టంగూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామశివారులో రాత్రి వేళల్లో మేకల చోరీలకు పాల్పడుతున్న నలుగురు ముఠాను అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపారు. వారి నుంచి రూ.30వేల నగదు, ఆరు మేకలు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం పోలీసుస్టేషన్‌లో విలేకర్లకు వెల్లడించారు. కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మేకల చోరీలకు పాల్పడిన విషయం వెల్లడైందన్నారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన కాంపాటి అజయ్‌కుమార్, కాంపాటి హుస్సేన్, మట్టి సురేష్, కొడి వంశీలు కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ డ్రైవింగ్‌తో పాటు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నారని తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగాలతో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు మేకల దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. జూలై నెలలో కట్టంగూరు మండలం చెర్వుఅన్నారంలో మూడు మేకలు, పరడలో నాలుగు మేకలను చోరీ చేశారని ఇదే తరహాలో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో రెండు చోట్లు, నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోట చోరీలకు పాల్పడ్డారని వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కట్టంగూరు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



మిథున్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళ గంజాయి రవాణా చేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని సోమవారం యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇదే ఘటనలో మరో ఇద్దరు పరారయ్యారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం తెల్లవారుజామున పోచంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, హెచ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ సాయికుమార్, డ్రైవర్ వెంకటేశం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటల సమయంలో అయ్యప్పగుడి వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా ఉండడంతో వివరాలు అడిగారు. సరైన సమాధానం చెప్పకపోగా, అతడి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేశారు. అందులో 120 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే స్టేషన్‌కు తరలించి విచారించారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో ఉంటున్న బిహార్ రాష్ట్రం బారాహితోల సుఖసాని గ్రామానికి చెందిన తంటి మిధున్ కుమార్(33)గా గుర్తించారు. స్థానికంగా సెంట్రింగ్ వర్క్ పనులు చేస్తున్నాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇక వ్యవసాయ-శాఖ పల్లెబాట

(5వ పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ప్రతీ రైతు సమాచారాన్ని నిక్షిప్తం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా మూడు జిల్లాలో నవంబరు 1వ తేదీ లోగా పూర్తిచేసి నవంబరు 3న గ్రామపంచాయతీల్లో రైతుల పేర్లు, వారి పంటల వివరాలను ప్రదర్శిస్తారు. 8న రైతుల నుంచి అభ్యంతరాలు తీసుకుంటారు. నవంబరు 11న అభ్యంతరాలను పరిశీలించి 13వ తేదీన ఫైనల్ చేసి డేటాను పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి నివేదిస్తారు.

పంటల విక్రయ సమయంలో..

పంటల దిగుబడి వచ్చే నాటికి సర్వే నెంబర్ల వారీగా వివరాల నమోదును పూర్తిచేస్తే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచన. ఏ మేరకు పంటల దిగుబడు వస్తాయి? అందుకు ఎన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలనే దానిపైనా అధికారులు సర్వే చేయనున్నారు. దీంతో పాటు రైతుబంధు, రైతుబీమా, పంట రుణాల వంటి సమస్యలు కూడా రైతుల సమగ్ర వివరాలతో తొలిగే అవకాశం ఉంది. అదేవిధంగా పంటల కొనుగోలు సమయంలో రైతులు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయాలి? ధాన్యం కొనుగోలుకు ఎన్ని ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే దానిపై అధికారులు ఓ అంచనాకు వస్తారు. వానాకాలంలో ప్రధానంగా వరి, ఆ తరువాత పత్తినే రైతులు అధికంగా సాగుచేశారు. గతంలో పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని, అధికారులు ఆ గ్రామంలో 400 నుంచి 500 ఎకరాల వరకు పంటల వివరాల నమోదు ఎలా ఉందనే విషయాన్ని పరిశీలించేవారు. ఈ విధానంతో అంతగా ప్రయోజనం లేదని భావించిన ప్రభుత్వం ప్రతీ సర్వే నెంబర్‌ను అధికారులు చూసిన తరువాతే వివరాల నమోదు అంటూ వ్యవసాయశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. గతంలో 400 నుంచి 500 ఎకరాల్లో ఏ ఒక్క సర్వే నెంబర్ కూడా బ్రేక్ చేయకుండా సర్వే చేయగా, ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా పూర్తి స్థాయిలో అన్ని సర్వే నెంబర్లను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఈ వివరాలు సమగ్రంగా ఉంటే వచ్చే యాసంగికి, ఆ తరువాత వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు మొదలు ఎరువులు, రుణాలు, రైతు భరోసా పకడ్బందీగా అమలుచేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ వానాకాలం సర్వేను సమగ్రంగా చేపట్టనున్నారు. అదేవిధంగా కొంతమంది దళారులు, వ్యాపారులు రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకొని దొడ్డిదారిన పత్తి, ధాన్యాన్ని విక్రయించకుండా చెక్ పెట్టేందుకు రైతుల సమగ్ర సర్వే ఉపయోగపడనుంది. కేవలం రైతులు ఇచ్చిన వివరాల ప్రకారం, వారి పంట దిగుబడులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసి దళారులను నిలువరించనుంది.

తాళం వేసిన ఇళ్లలో చోరీలు

మునుగోడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడులో ఆదివారం రాత్రి తాళం వేసిన ఇళ్లలో చోరీ జరిగింది. కమ్మగూడెంలో బొంత లింగస్వామి తనఇంట్లోనే ఆటో మెకానిక్‌షాపు నిర్వహిస్తున్నాడు. అనారోగ్యానికి గురైన బంధువును చూసేందుకు కుటుంబీకులతో కలిసి 24న ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీసి, తాళం పగిలి ఉండటం చూసిన స్థానికులు ఆయనకు సమాచారం అందించారు. అదేవిధంగా లింగస్వామి ఇంటిపక్కన తాళం వేసి ఉన్న కొంక పాతిమ అనే ఒంటరి మహిళ ఇంట్లో సైతం చోరీకి పాల్పడ్డారు. అయితే ఏమీ పోలేదు. లింగస్వామి సాయంత్రం వచ్చి చూడగా కొంత నగదుతో పాటు వివిధ బంగారు నగలను దొంగలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రవి చోరీ జరిగిన ఇళ్లను సందర్శించారు.

కన్నులవిందుగా క్రీడాకారుల పండుగ

- భువనగిరిలో టెన్నిస్ టోర్నమెంట్
- 180మంది ఆటగాళ్ల రాక



అకాడమీలో టెన్నిస్ పోటీల సందర్భంగా ఆడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



• క్రికెట్ బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో విద్యార్థులు



• స్కేటింగ్ ప్రాక్టీస్‌లో విద్యార్థులు





కరాటే ప్రాక్టీస్‌లో విద్యార్థిని..

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ప్రతిష్ఠాత్మక రాజానర్సింహరావు స్మారక ఐటీఎఫ్-జే60 టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలోని న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో ప్రారంభమైంది. అమెరికా, దక్షిణకొరియా, ఫ్రాన్స్ పలు దేశాల నుంచి 180మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థుల ప్రదర్శన అందరినీ అలరించింది.

• (ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్-యాదాద్రి)

పడిగాపులు కాసినా..

● యూరియా కోసం రైతుల కష్టాలు ● క్యూలైన్‌లో చెప్పులు, పాస్‌పుస్తకాలు ● రోజంతా క్యూలైన్లో నిలబడినా నిరాశే



నల్లగొండ జిల్లా కనగల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల దుకాణాలు, సొసైటీ చుట్టూ తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రోజంతా క్యూలైన్‌లో నిలబడి ఓపిక నశించి ఆగ్రహంతో రోడ్డెక్కుతున్నారు.

నిడమనూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలకేంద్రంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. యూరియా లోడ్ వస్తుందని చెప్పడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో సోమవారం సొసైటీ వద్దకు వచ్చారు. యూరియా లోడ్ రాలేదని, పక్క సొసైటీకి పంపించారని తెలియడంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై బైఠాయించారు. రైతుల ఆందోళనకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉప్పు సురేష్ సిబ్బందితో వచ్చి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఏవో మునికృష్ణయ్య కూడా అక్కడికి రావడంతో రైతులు అధికారులతో వాదనకు దిగారు. యూరియా కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. ఎరువుల దుకాణదారులు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని ముకుందాపురంలో 220 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, అక్కడికి వెళ్లి తెచ్చుకోవాలని ఏవో రైతులకు సూచించారు. యూరియా అవసరాల గురించి ఉన్నతాధికారులతో మాట్లాడామని మంగళవారం లోడ్ వస్తున్నందున రైతులకు సక్రమంగా పంపిణీ చేస్తామని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, వింజమూరి శివ, బీజేపీ నాయకుడు కోటేశ్వర్‌రెడ్డి, రైతులు బిజిలీ అశోక్, చేగొండి శంకర్, వెంకన్న, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు యూరియా సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందించారు.

క్యూలో చెప్పులు పెట్టి నిరీక్షణ

అనంతగిరి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కేంద్రంలో తెల్లవారుజామునే లేచి సహకార సంఘాల వద్ద క్యూలైన్‌లో గంటల తరబడి వెచిఉన్నారు. ఓపిక నశించి చెప్పులు లైన్లో ఉంచారు. ఎరువుల కోసం ఇక్కడే ఉండడంతో ఇతర పనులు పనులు ఆగిపోతున్నాయ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. క్యూలో ఉన్నా సరిపడా యూరియా అందే పరిస్థితి లేదని రైతులు తెలిపారు.

రైతులకు తప్పని అగచాట్లు



కేతేపల్లిలో చెప్పుల వరుస ఉంచిన రైతులు

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి పీఏసీఎస్‌లో 540బస్తాల యూరియా దిగుమతి అయింది. విషయం తెలిసిన మండలంలోని వివిధ గ్రామాల రైతులు సోమవారం ఉదయాన్నే కేతేపల్లికి చేరుకుని యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూ కట్టారు. క్యూలైన్లో రైతుల మధ్య తోపులాట జరగడంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి రైతుల ఆధార్ కార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలు వరుసలో పెట్టాలని సూచించారు. దీంతో పలువురు రైతులు తమ ఆధార్‌కుర్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టగా మరికొందరు చెప్పులను క్యూలో పెట్టారు. క్యూలైన్లోని ఆధార్ కార్డులు, పాసు పుస్తకాలు, చెప్పుల ఆధారంగా ఒక్కో పుస్తకానికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. దిగుమతి అయిన బస్తాల కన్నా రైతులు అధికంగా ఉండడంతో లైను చివరలో ఉన్న రైతులకు యూరియా అందనేలేదు. దీంతో రోజంతా క్యూలైన్లో నిలబడినా యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.



రైతులను క్యూలో ఉంచుతున్న పోలీసులు

పోలీసుల పర్యవేక్షణలో..

కట్టంగూరు: నల్లగొండ జిల్లా కట్టంగూరులోని పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు పీఏసీఎస్ వద్దకు వచ్చి రైతులను క్యూలైన్‌లో ఉంచి యూరియాను సరఫరా చేయించారు. పీఏసీఎస్‌కు 443 యూరియా బస్తాలు వచ్చాయి. రైతులకు ఉన్న వ్యవసాయం ఆధారంగా ఒక్కొక్క రైతుకు రెండు నుంచి నాలుగు యూరియా బస్తాలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రవీందర్, ఏవో గిరి ప్రసాద్, సీఈవో బండ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిడమనూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం : బీఆర్‌ఎస్

పెద్దఅడిశర్లపల్లి: రైతులకు యూరియా అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యొల్గురి వల్లపురెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆర్వపల్లి నర్సింహ, బొడ్డుపల్లి మహేందర్, మునగాల అంజిరెడ్డి, సుధాకర్‌గౌడ్, ఎర్ర యాదగిరి, రాయనబోయిన శ్రీను, దేపావత్ నరేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట పొలాలను రక్షించాలి : సీపీఎం

నల్లగొండ రూరల్: రైతాంగానికి అవసరమైన యూరియాను అందించి పంట పొలాలను రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నల్లగొండ మండల వ్యవసాయ అధికారి కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. నెల రోజులుగా నాట్లు వేసిన రైతులు యూరియా దొరక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలుపరాజు సైదులు, నాయకులు పోలే సత్యనారాయణ, కొండ వెంకన్న, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు: యూరియా సరఫరా చేయకుండా కొరత సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లెపు అడవయ్య, పట్టణ కార్యదర్శి బేజాడికుమార్ ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమొక్రసీ ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఆర్. జనార్ధన్, మామిడాల సోమయ్య, రాజయ్య, రాఘవరెడ్డి, బర్మబాబు, సహదేవ్, శ్రీనివాస్, సుదర్శన్, కొమరయ్య, బాలమల్లేష్, గోపాల్‌రెడ్డి, స్వామి, సత్యనారాయణ, మార్కండయ, గాడ యాదగిరి, రాములు పాల్గొన్నారు.

రాస్తారోకో

కనగల్: నల్లగొండ జిల్లా కనగల్‌లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. పీఏసీఎస్‌కు యూరియా లోడ్ వచ్చిందని పుకారు వ్యాపించగా రైతులు పెద్ద సంఖ్యలో పీఏసీఎస్ కేంద్రానికి చేరుకున్నారు. యూరియా కోసం తమ పట్టా పుస్తకాలను క్యూలైన్లో పెట్టి కార్యాలయ సిబ్బంది వచ్చే వరకూ ఎదురు చూశారు. తొమ్మిది గంటల సమయంలో పీఏసీఎస్ కేంద్రానికి సిబ్బంది చేరుకుని యూరియా లోడ్ ఇంకా రాలేదని సమయం పడుతుందని రైతులకు చెప్పారు. దీంతో రైతులు ఆగ్రహంతో చేస్తూ కనగల్ ఎక్స్‌రోడ్డుకు చేరుకుని అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. గంటల తరబడి క్యూలో ఉన్నా యూరియా బస్తాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవో అమరేందర్‌గౌడ్, పోలీసులు రైతులకు సర్దిచెప్పి రాస్తారోకోను విరమింపజేయించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో 400 బస్తాల యూరియా లోడ్ పీఏసీఎస్‌కు రాగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి : ఎమ్మెల్యే పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్: ఎరువుల కొరత లేకుండా చూడాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కోదాడ డివిజన్ పరిధిలో వరినాట్లు పూర్తి అయినందున యూరియా ఎక్కువ అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన యూరియా కోట సక్రమంగా విడుదల కాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే వ్యవసాయాధికారులు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కోదాడ, చిలుకూరు, నడిగూడెం, మునగాల, అనంతగిరి మండలాల్లో యూరియా కొరతను నివారించేందుకు వ్యవసాయాధికారులు జిల్లా అధికారులను సంప్రదించి యూరియా సహకార సంఘాలకు అందించేందుకు కృషిచేయాలన్నారు.



నల్లగొండలో ఎరువుల దుకాణం వద్ద క్యూలో ఉన్న రైతులు



మిర్యాలగూడలో ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

అసమర్థ పాలనతోనే యూరియా కొరత

కేతేపల్లి: ప్రభుత్వ అసమర్థ పాలనతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న యూరియా కొరతతో రైతులు క్యూలో నిలబడి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. యూరియా ఎంత అవసరమనేది నాలుగు నెలల క్రితమే తెలిసినా ఆ మేరకు ఎరువులను తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎం. వెంకటరెడ్డి, నాయకులు కె. ప్రదీప్‌రెడ్డి, బంటు మహేందర్, బి. శ్రీనివాసయాదవ్, చిమట వెంకన్న, ఆర్. సైదులుగౌడ్, బి. సురేష్, కె. సైదిరెడ్డి, జి. వెంకటయ్య, డి. వెంకటేష్ పాల్గొన్నారు.

శివకేశవులకు విశేష పూజలు



హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఖజానాకు రూ.18,56,806 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావ్ తెలిపారు. కాగా, కెనడాలో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. అత్యంత వైభవంగా నిర్వహించిన కళ్యాణోత్సవంలో టొరంటో ఎంపీ దీపక్ ఆనంద్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శన అద్భుతమైన అనుభూతి



బుద్ధవనంలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ తదితరులు

నాగార్జునసాగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో తెలంగాణ పర్యాటక శాఖ నిర్మించిన బుద్ధవనం సందర్శన అద్భుతమైన అనుభూతిని ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ అన్నారు. నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా సోమవారం ఆయన జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ, సాగర్ ప్రధాన డ్యాం, బుద్ధవనాన్ని తిలకించారు. బుద్ధవనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధవనంలో చరిత వనం, జాతక వనం, ధ్యాన వనం, స్తూప వనంలను తిలకించారు. మహాస్తూపం లోపల బుద్ధ జ్యోతిని వెలిగించారు. బుద్ధవనం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే వీడియోను తిలకించారు. ఆయనకు బుద్ధవనం ఈవో రవిచంద్ర, ఎస్టేట్ మేనేజర్ శాసనాలు బుద్ధవనం విశేషాలను వివరించారు. పంచశీల కండువాతో సన్మానించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక శాక బుద్ధవనాన్ని మహాద్భుతంగా నిర్మించిందన్నారు. మహాయాన బౌద్ధాన్ని బుద్ధవనంలో పునర్నిర్మించడం గొప్ప విషయమని అన్నారు. ఆయన వెంట ఏపీ టీడీపీ లీగల్ సెల్ సలహాదారుడు పోసాని వెంకటేశ్వర్లు, విజిట్ మీడియా ప్రతినిధి సుధాకర్, డాక్టర్ జయకుమార్, పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ ఉన్నారు.

సాగర్, మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి/నాగార్జునసాగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జనసాగర్‌కు, మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. సాగర్ 18గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి 1,90,042 క్యూసెక్కుల వరద వస్తుండగా, అంతే నీటిని దిగువకు వదులుతున్నాఉ. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఈ నెల ఆరంభంలో మూసీ నది ఉధృతంగా ప్రవహించి, భారీగా వరద నీరు మూసీ ప్రాజెక్టుకు చేరడంతో 13రోజుల పాటు ప్రాజెక్టు క్రస్టుగేట్లు ఎత్తి అధికారులు వరద నీటిని దిగువ మూసీకి వదిలారు. ఈ క్రమంలో తగ్గుముఖం పట్టిన ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం 1702.87క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం 1854.59క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు 2వ నెంబరు క్రస్టుగేటును ఒక అడుగు మేర ఎత్తి 646.87క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఆర్థిక సేవలను వినియోగించుకోవాలి

● కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

భువనగిరి రూరల్/ వలిగొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకుని ఆర్థిక పరిపుష్టి పెంపొందించుకోవాలని కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ అనురాధ అన్నారు. భువనగిరి మండలం కూనూరు గ్రామంలో సోమవారం జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జన సురక్ష బీమా పథకాలు , స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ రుణాల మీదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రాధాన్యత పీఎం జన్‌ధన్ యోజన , పీఎం జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. అదే విధంగా ప్రస్తుత ఖాతాల కేవైసీ ప్రాముఖ్యం, సైబర్ మోసాల నుంచి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్బీఐ అధికారులు అవగాహన సమావేశంలో పాల్గొని ముఖాముఖి మాట్లాడి ప్రాంతంలో బ్యాంకింగ్ సౌకర్యాల లభ్యతపై ఖాతాదారుల నుంచి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ శాంతికుమార్, ఎల్‌డీఎం శివరామకృష్ణ, అదనపు డీఆర్‌డీవో జంగారెడ్డి, డీపీఎంలు ప్రభాకర్, రవీందర్, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఏపీఎం పాశికంటి మల్లేశం, బ్యాంక్ మేనేజర్లు, లీడ్ బ్యాంకు సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● వలిగొండ మండలంలోని అరూరు గ్రామంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జననీ సురక్షా బీమా పథకాలు, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ రుణాలపై అవగాహన నిర్వహించారు. సమావేశంలో కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ అనురాధ, బ్యాంకు హనుమకొండ రీజనల్ మేనేజర్ శాంతికుమార్, లీడ్ డిస్టిక్ మేనేజర్ శివరామకృష్ణ, అదనపు గ్రామీణబివృద్ధి అధికారి జంగారెడ్డి, డీపీఎంలు ప్రభాకర్, రవీందర్, సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి సత్తా నిరూపించుకోవాలి

● మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గౌరవం లేని దగ్గర ఉండడం కంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి దమ్ము, ధైర్యం ఉంటే సొంతంగా పోటీ చేసి సత్తాను నిరూపించుకోవాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో సోమవారం బీజేపీ మండల కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రజా సమస్యలను పక్కన బెట్టి మంత్రి పదవి కోసం కోట్లాడడం చూస్తుంటే ఉమ్మడి జిల్లా ప్రజలకు సిగ్గేస్తోందని ఎద్దేవా చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమాల ఖిల్లా అని, పౌరుషానికి పెట్టింది పేరని, అంతటి ఘనమైన జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే తనకు మంత్రి పదవి కోసం ఉద్యమాల ఖిల్లా విలువను తీస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశా రు. ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేని ము ఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను అవమాన పరిచే విదంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజీనామా చేయాలని, లేదా బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి విన్నవిస్తామని ఆయన తెలిపారు. చౌటుప్పల్ ప్రాంత అభివృద్ధి కోసం పరిశ్రమలు కేటాయిస్తున్న వందల కోట్ల సీఎస్సార్ నిధుల్లో 80 శాతం ఎమ్మెల్యే అనుచరులు, కాంగ్రెస్ నాయకులు తింటున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్ రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు కైరంకొండ అశోక్, కడారి కల్పన, నాయకులు దూడల బిక్షంగౌడ్, రామనగోని శంకర్, ముత్యాల భూపాల్‌రెడ్డి, కడారి అయిలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

దూరవిద్యతో ఉజ్వల భవిత

● డిప్యూటీ డైరెక్టర్ ధర్మానాయక్



భువనగిరిలో ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న స్టడీసెంటర్ నిర్వాహకులు

భువనగిరి టౌన్/ ఆలేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దూరవిద్యలో చదువుకుంటే ఉజ్వల భవితసాధ్యమవుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ధర్మనాయక్ అన్నారు. సోమవారం భువనగిరిలోని ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడా రు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని నూ తన కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం డిగ్రీ ప్రవేశాల గడువును ఈనెల 30 వరకు పొడిగించినట్టు తెలిపారు. ప్రతీ కౌన్సిలర్ కనీసం 50 అడ్మిషన్లు తేవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, కోఆర్డినేటర్ డాక్టర్ గంజి రమేష్, బి.బాలయ్య, లెక్చరర్లు, పి.బాల్‌రెడ్డి, కే.కిష్టయ్య, ఎన్.సత్యనారాయణ, ఎన్.సుధ, బి.పాండురంగం, కే.బాలరాజు, ఎండీ.ఆసిఫ్ అలీ, ఎస్.లింగమూర్తి, ఎస్ఎస్వీఎన్ శివప్రసాద్, ఎండీ.అత్తర్ ఫారిన్, డి.పాండురంగం, ఆర్.బాలరాజు పాల్గొన్నారు. ఆలేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడి సెంటర్‌ను అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరక్టర్ దర్మా నాయక్ పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.రాజారాం స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ జ్యోతి,అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ కాతను పరిశీలిస్తున్న అధికారులు

ఆయిల్‌పామ్ తొలి కాత కోత

ఆత్మకూరు (ఎం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరిజిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన ఏనుగు దయాకర్‌రెడ్డి నాలుగేళ్లుగా 10 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట మొదటి దశ కాత రావడంలో సోమవారం అయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ ఖాజామొయినుద్దీన్, డీహెచ్ఎస్ఓ మాధవిల సమక్షంలో మొదటి దశ కోత కోశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతీ గెల దాదాపు 2.5 కిలోల నుంచి 3 కిలోల వరకు బరువు తూగుతుందని తెలిపారు. ఈదశలో మొత్తం కాత 1టన్ను వరకు రావచ్చని అంచనా వేశారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి స్రవంతి, మండల వ్యవసాయ అధికారిని పూజ, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న రహత్‌ఖానం, పోలీస్‌సిబ్బంది

రామన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రహత్‌ఖానం అన్నారు. సోమవారం నాడు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రహత్‌ఖానం ఇంటర్నల్ కంప్లెయింట్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ అధికారులు ర్యాగింగ్ నిరోధక చట్టం ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినుల పట్ల గౌరవంగా ఉండాలని, ప్రతీ విద్యార్థీ సమాజ నిర్మాణానికి తోడ్పడాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

వీల్‌చైర్ బాస్కెట్ బాల్ జాతీయ పోటీలకు ఎంపిక



వీల్‌చైర్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన సురేష్

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీకి మండలంలోని రంగుండ్లతండాకు చెందిన ధరావత్ సురేష్‌నాయక్ ఎంపికయ్యాడు. వచ్చే నెల 1 నుంచి 10వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో గల అటల్ బీహారీ ట్రైనింగ్ సెంటర్ ఫర్ డిజెబిలిటి స్పోర్ట్స్ ఆవరణలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. రాష్ట్ర జట్టు తరుపున సురేష్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో లావణ్య కోరారు. హుజూర్‌నగర్, బూరుగడ్డలో సోమవారం కళా ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక శాఖా ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పట్ల కళాజాత నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లెల లక్ష్మణ్, రాము, భిక్షపతి, ఉదయ్, శంకర్, ఉపేందర్, నాగలక్ష్మీ, మంజుల, రాధ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు

హుజూర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్ఐ బండి మోహన్ కోరారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి కోసం గ్రామస్థుల ఆందోళన

నూతనకల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని ఎర్రపహాడ్ గ్రామస్థులు గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామంలో నల్లాలకు మురుగు నీరు వస్తోందన్నారు. మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ మంచినీరు రావడం లేదన్నారు. అధికారులు స్పందించి మంచినీరు సరపరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగరాజు, శీలం నారాయణ, దంతాల రామస్వామి, గౌడిచెర్ల లింగయ్య, ఇరుగు అంజయ్య, కొమ్మనబోయిన అనిల్, సందీప్, ఉపేంద్ర సైదమ్మ పాల్గొన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సత్యవతిని వివరణ కోరగా గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడంతో నీటి సరపరా ఆగిపోయిందన్నారు. గతంలో ఉన్న గ్రామపంచాయతీ బోర్లు కుంటలో మునిగి ఉండడంతో ఎర్రటి నీరు వస్తుందని, చర్యలు తీసుకుంటామన్నారు.

సులభ బోధనకు టీఎల్ఎం మేళా దోహదం

నేరేడుచర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సులభతరంగా బోధించేందుకు టీఎల్ఎం మేళా దోహదపడుతుందని తహసీల్దార్ సురగి సైదులు, మునిసిపల్ కమిషనర్ యడవెల్లి అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం మేళాను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఉత్తమ బోధనకు బోధనోపకరణాలు ఉపయోగపడతాయన్నారు. ఎంఈవో పుట్టారి సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నేరేడుచర్ల పెంచి కల్‌దిన్న ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఎల్. శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, సీనయ్య, సత్యనారాయణ, అక్కయ్యబాబు, మూలగుండ్ల వెంకటరెడ్డి, కందిబండ అనసూయ, జమీల, మజీదా బేగం, అనసూర్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో బోధన అభ్యసన సామాగ్రి మేళాను ఎంఈవో తల్లాడ శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో శాంతినగర్ కాంప్లెక్స్ హెచ్ఎం పురుషోత్తం, త్రిపురవరం కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనరసయ్య, రిసోర్స్ పర్సన్స్ శేఖర్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, మీరావలి, రమేష్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కోదాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ అన్నారు. సోమవారం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగం, ఉపాధి కల్పించే విధంగా బోధన ఉంటుందన్నారు. ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీని ఉపయోగించికొని సాంకేతికతలో వస్తున్న మార్పులను గమనించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, నరేష్‌రెడ్డి, స్రవంతి, జనార్ధన్, ఎజాజ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలి

కోదాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోదాడలో ఈనెల 31వ తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు రూ 6వేలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులకు రూ 4వేలు, పూర్తి అంగవైకల్యం ఉన్నవారికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాల్గొంటారని తెలిపారు.

యలమంచమ్మ ఆశయాలు సాధించాలి

గరిడేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కేశబోయిన పెద్దనర్సయ్య సతీమణి ఎలమంచమ్మ ఆశయాలు సాధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ములకలపల్లి రాములు అన్నారు. సోమవారం వెలిదండలో అనారోగ్యంతో మృతిచెందిన ఎలమంచమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భర్త నర్సయ్యకు అండగా ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, షేక్ సైదా, సైదులు, ముత్యాలు, సో మయ్య, భిక్షం పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

మఠంపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి, హుక్కా వ్యాపారంపై ఉక్కుపాద మోయాలని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటశివ మాట్లాడుతూ పక్కదారి పడుతున్న యువత భవిష్యత్ నాశనం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివాజీనాయక్, వీరయ్య, బాలునాయక్, కొండలు, వీరారెడ్డి, అమరయ్య, గోపాల్, కోటేశ్వరావు, స్వామినాయక్, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

మఠంపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): యూరియ కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ అన్నారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు యూరియా పంపిణీ చేసి మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో రైతులకు యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఏవో శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియ నిల్వపై ఆరా తీశారు. మండలంలో అధిక ధరలకు యూరియా విక్రయిస్తే తన దృష్టికి తేవాలన్నారు. నిబంధనల ప్రకారం ఎరువులు, మందులను పంపిణీ చేయాలని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఈవో తిరపతయ్య, ఏఈవోలు సునీత, త్రివేణి పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

తుంగతుర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కబడ్డీ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం కోసం రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బోయిని లింగయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, క్రీడల కన్వీనర్ కొనడాదుపుల యాకయ్య, పీడీలు మల్లేష్, పుల్లయ్య, యాదయ్య, అంబేద్కర్, శ్రీనివాస్, గాజుల యాదగిరి, శ్రీకాంత్, అంజయ్య, చంద్రయ్య, చంద్రమౌళి, వీరేందర్, పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పెన్‌పహాడ్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అవిరెండ్ల జానయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంబించారు. గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సైదిరెడ్డి మాట్లాడుతూ 30మంది పేద మహిళలకు నెలరోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్బు జ్యోతి, ఏపీఎం దాసరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్ష కేంద్రాలపై పర్యవేక్షణ ఉండాలి

మునగాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అనుమతి లేకుండా రక్త పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని సామాజిక ఉద్యమకారుడు కె. వెంకటేశ్వర్లు, ఎం. రామకృష్ణ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. సీజనల్ జ్వరాలతో బాధ పడుతున్న వారిని ఆసరా చేసుకొని రక్త పరీక్ష కేంద్రాల నిర్వహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి పర్యవేక్షించాలని కోరారు.

గణపయ్య పండుగ.. గ్రామాల్లో సందడి



కోదాడరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగకు ప్రతి గ్రామంలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు సిద్ధమవుతున్నాయి. పండుగ మూడు రోజులే ఉండడంతో విగ్రహాల తయారీదారులు రాత్రిబవళ్లు కష్టపడి విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పెద్ద సంఖ్యలో విగ్రహాలు తయారు చేసినట్లు వారు తెలి పారు. కోదాడ ప్రాంతంలో ప్రతి సంవత్సరంలో 30 వేలకు పైగా విగ్రహాలు తయారవుతున్నట్లు పేర్కొన్నారు. ఐదు అడుగుల నుంచి 20 అడుగుల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నా మని తెలిపారు. ఒక్కో విగ్రహం రూ.వెయ్యి నుంచి రూ.50వేల వరకు విక్రయిస్తున్నట్లు త యారీదారులు పేర్కొన్నారు. గతంలో కంటే ఈ సారి 20శాతానికి పైగా ధరలు పెరిగాయి. ప్రతి సంవత్సరం విగ్రహాల తయారీకి ఉపయోగించే రంగులు, కాస్మోటిక్స్, తదితర వస్తువులు విపరీతంగా రేట్లు పెరగడంతో ఈ రేట్లు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా గ్రామంలో మూడు నుంచి ఐదు విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సారి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వాళ్లు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలని పోలీసులు సూచించారు. విద్యుత్ శాఖ నుంచి కూడా అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, రికార్డు డాన్సులు, డీజేలు కూడా నిషేధించామని పోలీసులు పేర్కొన్నారు.





ఆదిలోనే నిరసన

(5వ పేజీ తరువాయి)

వచ్చి పోతుంటారు. హుజూర్‌నగర్ పట్టణానికి దగ్గరగా ఉండడంతో ఈ భూమి అన్నిరకాలుగా ఆమోదయోగ్యంగా ఉన్నట్లు యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, రెవెన్యూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. దాంతోనే మగ్దుమ్‌నగర్ భూమిని సర్వే చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు భూసేకరణపై నిరసన తెలపడం, పురుగుమందుల డబ్బాలతో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన తెలపడం సంచలనంగా మారింది. హుజూర్‌నగర్‌లో వ్యవసాయ యూనివర్సిటీ అవసరమని కొంతమంది రైతులు మద్దతు ఇస్తుండగా మరికొంతమంది వ్యతిరేకిస్తుండం అనేక అనుమానాలకు తావిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

యూనివర్సిటీకి రైతులు సహకరించాలి

వ్యవసాయ యూనివర్సిటీకి రైతులు సహకరించాలి. యూనివర్సిటీ వల్ల ఉమ్మడి జిల్లాలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కొత్త వంగడాలు అందుబాటులోకి వస్తాయి. యూనివర్సిటీ వచ్చినా ఆ భూముల్లో మళ్లీ వ్యవసాయమే చేస్తారు. రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం సహాయం చేస్తుంది. నష్టపరిహారం కూడా అందిస్తోంది.

● తన్నీరు మల్లికార్జున్‌రావు,

రైతుల భూములు గుంజుకోవడం సరికాదు

యూనివర్సిటీ కోసం రైతుల భూములు గుంజుకోవడం సరికాదు. కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. సాగుకు యోగ్యంగా లేని మరోచోట యూనివర్సిటీని నిర్మించుకోవాలి. రైతులకు సమాచారం లేకుండా భూమి తీసుకోవడం సరికాదు.

పశ్య వెంకటరెడ్డి, రైతు

వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తెస్తాం



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పద్మావతి

మోతె, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నామవరంలో రెండు సంవత్సరాల నుంచి మరమ్మతులకు గురైన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను వినియోగంలోకి తెస్తామని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. గ్రామంలో ప్రజలకు సురక్షితమైన మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా నీటిని అందించేందుకు రిలయన్స్ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్లాంట్ రెండు సంవత్సరాలు మరమ్మతులకు గురైందని గ్రామస్తలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే నిధులతో తక్షణమే మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొస్తామన్నారు. ప్లాంట్ వివరాలు తెలుసుకుని ప్లాంట్‌ను పరిశీలించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. సిరికొండలో సోమవారం ముత్యాలమ్మ, బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి గ్రామదేవతలకు బోనం చెల్లించారు. అనంతరం మహిళలు బొట్టు, గాజులు అందజేశారు. గ్రామ పండుగలను గ్రామస్తులంతా సంతోష వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కీసర సంతోష్ రెడ్డి, నూకల మధుసూదన్‌రెడ్డి, సామ వెంకటరెడ్డి, భూనోత్ మాత్యనాయక్, పుల్లారావు, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రామాచారి పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో సోమవారం కనకదుర్గమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. రైతులు ప్రభలతో ప్రదర్శనలు చేశారు. మహిళలు బోనాలు, చీరలు, సారెలతో మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ రాధికాఅరుణ్‌కుమార్, భిక్షం, నరసింహరావు, గురవయ్య, నాగరాజు, వెంకయ్య, అయోధ్య, లింగయ్య, శ్రీనివాస్, పూర్ణ, రామస్వామి, కిరణ్, పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : సామేలు

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం మండలంలోని తాటిపాముల గ్రామంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ నిధులతో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటివరకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రుణమాఫీ, ఉచిత బస్ సౌకర్యం వంటి పనులు చేసి ప్రజాపాలన అందిస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, మండల అభివృద్ధి అధికారి లాజర్, డీఈ బాబురావు, ఏఈ మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేష్, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, లక్ష్మయ్య, క్రిష్ణ, ఎర్ర యాదగిరి, అంజయ్య, నర్సయ్య, సజన్, సిహెచ్. సోమయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మద్దిరాల మండలంలోని పోలుమళ్ల, ముకుందాపురం, తూర్పుతండా గ్రామాల్లో గ్రామ పంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన, సీసీ రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘతన సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు చేసి ముగ్గులు పోసి ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, మార్కెట్ చైర్మన్ తీగల గిరిదర్‌రెడ్డి, తహసీల్దార్ అయేషాపర్వీనా, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏవో అనిషారోహి, ఏఈ అఖిల్, ముక్కాల అవిలమల్లుయాదవ్, ఏలేటి స్వప్న, నాయకులు పచ్చిపాల వెంకన్న, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చామకూరి లింగరాజు పాల్గొన్నారు.



తిరుమలగిరి : తాటిపాములలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని శెట్టిగూడెం గ్రామస్థులు అన్నారు. గ్రామ సమస్యలపై కార్యదర్శిని నిలదీస్తే కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి సక్రమంగా విధులకు హాజరు కాకుండా పరిశుద్ధ్య పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్థులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హసీం పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

గరిడేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో ఆలయాలు అభివృద్ధి చెందుతాయని పూజారి కృష్ణశాస్త్రీ అన్నారు. సోమవారం మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామా నికి చెందిన ఆడబిడ్డలు తాటి వీణామాధురి, విక్రాంత్‌రెడ్డి ఇంజం సుమలత రాకేష్‌రెడ్డి దంపతులు స్థానిక రామాలయ మూల విరాట్టులకు రూ.50వేల విలువైన కిరీటాలు, గర్భగుడికి స్టీల్ గేట్లు అందజేశారు. కార్యక్రమంలో యడవెల్లి వెంకటరెడ్డి, పద్మ, శ్రీనివాస్‌రెడ్డి, పుష్పలత, రిత్విక్‌రెడ్డి, ఐరారెడ్డి పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల కమీషన్ విడుదల చేయాలి

నేరేడుచర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కమీషన్‌ను విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంఘం నాయకులు కోరారు. సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సురగి సైదులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ నెలలో నెలవారీగా బియ్యం పంపిణీ చేశామని, జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల బియ్యాన్ని ఉదయం 7గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బియ్యం పంపిణీ చేశామని తెలిపారు. ఐదు నెలలుగా డీలర్ల కమీషన్ విడుదల చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు ఇచ్చే కమీషన్‌ను వేర్వేరుగా కాకుండా పాత పద్ధతిలో ఒకేసారి విడుదల చేసి డీలర్ల ఖాతాలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్య క్షుడు కరణం పాండయ్య, రేషన్ డీలర్లు చింతమల్ల సైదులు, నరేష్, సత్యనారా యణ, భాస్కర్, పోతుగంటి రవి, తిక్కల శ్రీకాంత్, ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కిరణ్‌రెడ్డి, శ్రీనివాస్, ఎల్లయ్య, శ్రీనివాసరెడ్డి, స్వప్న, నరేష్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు ఇట్టిమళ్ల మధు, కార్యదర్శి రాగం లింగయ్య కోరారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసరి ధనమూర్తి, సుబ్బరాజు, పోటు నాగేశ్వరరావు, భీమిశెట్టి నాగేశ్వరరావు, సతీష్‌కుమార్, దివ్య, నాగమణి, కాశయ్య, ఎల్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: రేషన్ డీలర్లకు కమీషన్‌ను విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు బెల్లంకొండలక్ష్మీ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బుస్సా పాపయ్య, కోశాధికారి మామిడి సర్వయ్య కోరారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్‌లు వెంకన్న, కృష్ణ, విజయలక్ష్మీ, అనసూయమ్మ, రాజు, మంగమ్మ, సుగుణమ్మ, కరీం, భారతి పాల్గొన్నారు.

మునగాల: డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పి రామాంజనేయులు, ఎం శ్రీను, జి శ్రీనివాస్, డి అన్నపూర్ణ, చంద్రకళ, కె శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల: వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

ఆత్మకూర్(ఎస్): రేషన్ డీలర్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్బయ్య, గోవర్ధన్, గోపాల్‌రెడ్డి, రవీందర్, సత్యనారాయణ, విష్ణు, మూర్తి, భద్రయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల: రేషన్ డీలర్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి సంధ్యమల్లేష్, గూడ వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, పద్మారెడ్డి, సత్తయ్య, చంద్రశేఖర్, రాజేశ్వర్‌రావు, వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

తుంగతుర్తి: రేషన్ డీలర్లు తహసీల్దార్‌క వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల మండల అధ్యక్షులు ఓర్సు వెంకన్న, అబ్బగాని శోభారాణి, ఈగల లక్ష్మయ్య, రేణుక, ఉప్పలమ్మ, శ్రీధర్, వెంకట నర్సయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గరిడేపల్లి: రేషన్ డీలర్లు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు గుండు గుర్వయ్య, సైదా, చలిగంటి నాగయ్య, నాగంద్రబాబు, సైదులు పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలి

మద్దిరాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, మండల కార్యదర్శి పోలోజు సైదులు అన్నారు. సోమవారం మండలంలోని గోరెంట్ల గ్రామంలో సీపీఎం పోరుబాట కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని మాట్లాడారు. పెన్షన్ల కోసం పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కందాళ శంకర్‌రెడ్డి, దీకొండ ఉపేందర్, పులుసు లింగయ్య, మల్సూర్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు చేకూరుతుందని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో సూమారుగా 40 పైగా మట్టి విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు మట్టి విగ్రహాలను తీసుకోవాలని మండల కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హసీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఏఈ రవికుమార్, ఏపీవో ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: గణేష్ నవరాత్రుల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్రనాయక్ హెచ్చరించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డీజేలు ఉన్న యజ మానులు శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలన్నారు.



సూర్యాపేటఅర్బన్: జిల్లాకేంద్రానికి చెందిన కవి, రచయిత, సామాజిక కార్యకర్త శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పోతుగంటి వీరాచారికి అంతర్జాతీయ తెలుగు తేజం, తెలుగుభాషా పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వతేదీన ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నర్సరావుపేటలో అవార్డు అందుకోనున్నారు.

హుజూర్‌నగర్ రూరల్: ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండా హరీష్ కోరారు. సోమవారం ఎస్ఐ బండి మోహన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుండా గోపి, బలవంత్‌సింగ్, రంగనాథ్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట బాలాజీ హాస్పిటల్ ఆర్థిక సహకారంతో టై బెల్టులు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాములునాయక్, యాస రాంకుమార్‌రెడ్డి, హెచ్ఎం విద్యాసాగర్, డాక్టర్ గౌతమ్, డాక్టర్ స్పందన, సోమయ్య, యాదగిరి, నాగిరెడ్డి, శ్రీలత, నాగరాజు, రేణుక, జయమ్మ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం, పోసనబోయిన హుస్సేన్,

సంక్షిప్త సమాచారం..

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకటచంద్ర కోరారు. సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, నరసింహ్మాచారి, వీరస్వామి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్సెస్సీ క్యాంపులో మండలస్థాయి స్కూల్ గ్రేమ్స్ పోటీలు సోమవారం రసవత్తరంగా జరిగాయి. కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయి. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-15 పోటీలు నిర్వహించగా మంగళవారం బాలికల కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పీడీ రవికుమార్ , పీఈటీలు మైసయ్య, రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం సీఐటీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.అంజయ్య, పట్టణ కార్యదర్శి కొమర్రాజు కోరారు. సోమవారం పట్టణంలో సెప్టెంబర్ 1న జరిగే జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాంతయ్య, నాగులు, కరుణాకర్, నరసింహరావు, సైదులు, పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండల కేంద్రంలోని చీదేళ్ళ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఆగ్రో రైతు సేవా కేంద్రంలో సోమవారం నానో యూరియా వాడకంపై ఏవో అనిల్‌కుమార్‌నాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అదికారి వికాస్, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మునగాల: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారని వైద్యాధికారి రవీందర్ తెలిపారు. జర్వంతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆర్. వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం పనితీరును అడిగి తెలుసుకున్నారు.

మునగాల రూరల్: బీసీ ఉద్యమ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేట శివాజీముదిరాజ్‌లు సంఘీభావం తెలిపారు. బీసీలకు అన్ని పార్టీలు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల కిరణ్, బుచ్చయ్య, సతీష్, నరేష్, నవీన్, మహేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన భాషిపంగు భాస్కర్‌కు డాక్టరేట్ లభించింది. ఈ నెల 23న చెన్నైలోని భారతీయ విద్యా భవన్‌లో గ్లోబల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ అందుకున్నారు.